# సత్యవాక్కు

క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH

# రేడియో శ్రీలంకద్వారా క్రీస్తు సంఘముల కార్యక్రమములు

| | |
|---|---|
| తెలుగు | : సత్యవాణి (The Voice of Truth)<br>ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో<br>మధ్యాహ్నం 1-45 గంటలకు. |
| తమిళం | : సత్యవాణి (The Way of Truth)<br>మంగళవారం - 5-30 p.m.<br>గురువారం, ఆదివారం - 6-45 p.m. |
| మలయాళం | : The Voice of Truth<br>మంగళ, శుక్రవారాలు 8-45 p.m. |
| కన్నడ | : The Voice of Truth<br>ఆదివారం - 1-45 p.m. |
| హిందీ | : సత్యసుసమాచార్<br>మంగళ, గురు, శుక్రవారాలు 9-00 p.m.<br>ఆదివారం - 12-45 to 1-00 p.m. |
| ఇంగ్లీషు | : The Voice of Truth<br>సోమవారం - 9-00 p.m.<br>శుక్రవారం - 7-45 p.m. |

ఈ కార్యక్రమాలను అందరు వినండి. అందరికీ విన్పించండి.

Razan Electric Press, Kakinada-1.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

**Editor :** J.C. CHOATE

**Managing Editor :** JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 10 డిశంబరు 1989 సంచిక 5


# సంపాదకీయము

## దేవుడు మానవుల ద్వారా పనిచేయుచున్నాడు

### ( God works Through People )

పూర్వకాలమందు దేవుడు మానవులతో ప్రత్యక్షముగా సంభాషించి, అనేక మహాత్కార్యములను జరిగించి, తనకు ప్రతిగా తన దూతలను పంపించిన సందర్భము లనేకములున్నవి. చివరికి తన స్వంత కుమారుని మానవుల పాపముల నిమిత్తము చనిపోవునట్లు ఆయన పంపెను.

దేవుడు ఏవిధముగా తన సందేశమును తెలియజేసెనో, తన చిత్తమును ముఖ్యముగా మానవుల ద్వారా ఎట్లు నెరవేర్చెనో మనకు తెలియకపోలేదు. నోవహు, అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు, యోసేపు, మోషే, దావీదు, యెషయా, దానియేలు మరియు పాత నిబంధన కాలమందలి గొప్ప దేవుని సేవకులను మనము మరువలేము. వారిలో ఎస్తేరువంటి స్త్రీలు కూడ కలరు.

ఇశ్రాయేలీయుల రాజుగా నుండుటకు సౌలు అవిధేయత కారణంగా తిరస్కరింపబడిన పిమ్మట, అతనికి బదులు రాజుగా యౌవనస్థుడైన దావీదును దేవుడు నియమించెను. సమూయేలు ప్రవక్త దావీదునకు వర్తమానము నిట్లు అందించెను: "నీ రాజ్యము నిలువదు, యెహోవా తన చిత్తానుసారమైన మనస్సుగల యొకని కనుగొని యున్నాడు. నీకు ఆజ్ఞాపించిన దాని నీవు గైకొనక పోతివి గనుక యెహోవా తన జనుల మీద అతనిని అధిపతినిగా నియమించును" (1 సమూ 13 : 14). పౌలు ఈవిషయాన్ని తన ప్రసంగమందు అపొ. కా. 13 : 22లో ప్రస్తావించి దావీదు సంతానమునుండి క్రీస్తు ఎట్లు వచ్చెనో వివరించెను. దావీదును గూర్చి దేవుడు తన చిత్తానుసారమైన మనస్సు గలవాడని చెప్పుటలో అర్థమేమి ? దావీదు దేవుని ప్రేమించిన వాడని దేవుడు ఎరిగియుండెను. ఆయన చిత్తమునకు లోబడిన నిజమైన సేవకుడని దీని అర్థము. ఈ యౌవనస్థుడు బలవంతుడైన గొల్యాతును జయించుటకు నిలబెట్టబడెను. అతడు ఇశ్రాయేలీయుల రాజైన తరువాత యూదులను గొప్ప రాజ్యముగా చేసెను. అతనికి బలహీనతలున్నను తన పాపములనుండి మారుమనస్సు పొందగల హృదయము అతని కుండెను. కీర్తనల గ్రంథమును మనము చదివినప్పుడు దేవుని యెడల దావీదు ఎట్టి భయభక్తులను కలిగియుండెనో, ఆయనపై ఆధారపడిన విధాన్ని మనం గ్రహించగలము. ఆయన నిజముగా దేవుని చిత్తానుసారమైన మనస్సు గలవాడు.

## యేసు ప్రేమించిన శిష్యుడు

క్రీస్తు భూమిమీద వసించిన దినాలలో, యోసేపు, మరియ, బాప్తిస్మమిచ్చు యోహాను, అపొస్తలులు మొదలగు వారి గుణగణాల మననుం చదువుచున్నాము. యోహాను సువార్త యందలి ఒక ఆసక్తికరమైన విషయమేమంటే, యేసు ప్రేమించిన శిష్యుని

గూర్చి అనేకసార్లు అందు ప్రస్తావించబడినది. ఉదాహరణకు, పరిశీలిందాం. "ఆయన శిష్యులలో యేసు ప్రేమించిన యొకడు యేసు రొమ్మున ఆనుకొనుచుండెను (యోహా 13 : 23). సిలువవేయబడిన సమయములో "ఆయన తల్లియు, ఆయన తల్లి సహోదరియు, క్లోపా భార్యయైన మరియయు, మగ్దలేనే మరియయు యేసు సిలువనొద్ద నిలుచుండిరి. యేసు తన తల్లియు తాను ప్రేమించిన శిష్యుడును దగ్గర నిలుచుండుట చూచి— అమ్మా, యిదిగో నీ కుమారుడు అని తన తల్లితో చెప్పెను. తరువాత శిష్యుని చూచి యిదిగో నీ తల్లి అని చెప్పెను. ఆ గడియనుండి ఆ శిష్యుడు ఆమెను తన యింట చేర్చుకొనెను (యోహా 19:25-27). ప్రభువు మరణ, సమాధి, పునరుత్థానముల తరువాత మనకు బోధింపబడిన విషయ మేదనగా "ఆదివారమున ఇంకను చీకటిగా ఉన్నప్పుడు మగ్దలేనే మరియ పెండలకడ సమాధి యొద్దకు వచ్చి సమాధి మీాద ఉండినరాయి తీయబడియుండుట చూచెను. గనుక ఆమె పరుగెత్తుకొని సీమోను పేతురు నొద్దకును యేసు ప్రేమించిన ఆ మరియొక శిష్యుని యొద్దకును వచ్చి - ప్రభువును సమాధిలోనుండి యెత్తికొనిపోయిరి. ఆయనను ఎక్కడ ఉంచిరో యెరుగమని చెప్పెను" (యోహా 20:1-2). ప్రభువు సమాధినుండి లేచినందున ఆయన ఆమెకు కనపడలేదు. తరువాత ఆయన శిష్యులకు ప్రత్యక్షమై వారితో మాటలాడెను. ఈ మాట గమనించండి. "కాబట్టి యేసు ప్రేమించిన శిష్యుడు ఆయన ప్రభువు సుమి అని పేతురుతో చెప్పెను" (యోహా 21:7). "పేతురు వెనుకకు తిరిగి, యేసు ప్రేమించినవాడును, భోజనపంక్తిని ఆయన రొమ్మున ఆనుకొని - ప్రభువా, నిన్ను అప్పగించువాడెవడని అడిగిన వాడునైన శిష్యుడు తమ వెంట వచ్చుట చూచెను" (యోహాను 21:20).

యేసు ప్రేమించిన శిష్యుడు యోహాను అని చెప్పడానికి అనేక ఆధారము లున్నవి. యోహాను తన గ్రంథాన్ని వ్రాస్తూ

ఈ సందర్భాల్లో తన పేరు వ్రాయడానికి యిష్టపడకపోయి యుండ వచ్చును. తన తరువాత తన తల్లి సంరక్షణను తీసుకొనినవాడు ఈయనే. యేసు ప్రేమించిన శిష్యుడు అని ఆయన చెప్పుటకు ఇది కూడ ఒక కారణమై యుండవచ్చును. మరొక మాటలో యేసునకు అతనిపై ప్రత్యేకమైన ప్రేమ కలిగియుండెను. అది తన కుమారునిపై తండ్రి కున్న ప్రేమవంటిది. ఎందుకనగా తండ్రియొక్క బాధ్యతలను తండ్రి తరువాత కుమారుడు నిర్వర్తించవలసి యున్నది. ఈ విషయం ఇతర శిష్యులను ప్రభువు ప్రేమించలేదని కాదు. యితరులందరినీ ఆయన ప్రేమించలేదని అర్థంకాదు. యితరులందరికంటె తన బాధ్యత అప్ప గించే వానిపై ఒక గొప్ప ప్రేమ లేదా సన్నిహిత సంబంధముండుట ప్రకృతి సహజము.

క్రొత్త నిబంధన వ్రాయబడక మునుపు పేతురు, పౌలు, స్తెఫను, ఫిలిప్పు, తిమోతి, తీతు, అకుల ప్రిస్కిల్ల మొదలగు గొప్ప వ్యక్తులున్నారు. ఆ దినాల్లో సౌలుకు ప్రభువు ప్రత్యక్షమయ్యెను. ప్రత్యేకమైన పని నిమిత్తము దేవదూతలు పంపబడెను. అపొస్తలులకు పరిశుద్ధాత్మ పంపబడెను. అద్భుత కార్యములు జరిగించుటకు యితర భాషలు మాటలాడుటకు, దేవుని వాక్యము విభజించుటకు వారు కొందరిపై చేతులుంచిరి.

## లేఖనముల ద్వారా మాట్లాడుచున్నాడు

క్రొత్తనిబంధన యివ్వబడిన తరువాత దేవుడు క్రీస్తు ద్వారా లేఖనములనుండి మనతో మాటలాడుచున్నాడు (హెబ్రీ 1 : 1-2). పరలోకమునుండి ఒక దూత వచ్చి మరొక సువార్తను బోధించి నట్ల యితే వాడు శాపగ్రస్తుడు (గలతి 1 : 6-9). మనము దేవుని వాక్య ముతో దేనిని కలుపకూడదు, తీసివేయకూడదు. ఏ విధమైన మార్పును చేయకూడదు (ప్రక 22 : 18-19). ఈ విధముగ దేవుడు మానవుల

ద్వారా తన పనిని జరిగించుచున్నాడు. ఈ దినాల్లో లిఖింపబడిన వాక్యము ద్వారా ఆయన మాటలాడుచున్నాడు. ఆయన వారిని క్రీస్తుద్వారాను, క్రీస్తు లేఖనముల ద్వారాను పిలుచుచున్నాడు.

దేవుడు ముఖాముఖిగా మనతో మాటలాడుటలేదు. క్రీస్తు కూడ ఆ విధముగా మాటలాడుటలేదు. మన పని నిమిత్తము ఆయన తన దూతలను పంపించుటలేదు. అద్భుతములు చేయుటకు శక్తి మంతుల మగునట్లు పరిశుద్ధాత్మ శక్తిని ఆయన మన మీదికి పంపించుటలేదు. ఆయన మన నిమిత్తము చేయవలసిన దంతయు చేసెను. సువార్తనుబట్టి మంటి ఘటములలో ఐశ్వర్యము నించెను.

యుగాలనుండి యిప్పటివరకు దేవుని మాటనిని, ఆయన చిత్తమునకు సమర్పింపబడి విధేయత చూపుటకు మనస్సుగలవారై ఆయనను సేవించునట్లు వారి ద్వారా తన పనిని జరిగించుచున్నాడు. వారి ద్వారా ఆయన ఎన్నో గొప్ప కార్యాలను జరిగించెను. ఆయన ఎందుకు వారిని ఎన్నుకొన్నాడు? ఎందుకు వారిని ఉపయోగించుకొనుచున్నాడు? మనము ఈ విధముగ అడుగ వచ్చును. అయితే ఎందుకు వారు దేవుని ఎన్నుకొని ఆయన చిత్తమునకు లోబడుటలేదు?

## మన ద్వారా గొప్ప కార్యములు

ఈరోజు నిన్ను నన్ను ఆయనకు లోబడిన యితరులను గొప్ప కార్యాల్ని జరిగించడానికి ఉపయోగించుకొనుచున్నాడు. మోషే, దావీదు, దానియేలు, పౌలు, పేతురు మొదలగు వారిని ఆయన ఉపయోగించుకొనెను. మనము వారిలో ప్రతి విషయములోను సమానులము కాలేము. గాని వారివలె ఉన్నాము. మనము దేవుని నిమిత్తమై ఆయన చిత్తమును బట్టి గొప్ప కార్యాలను జరిగించడానికి ఉపయోగ పడుచున్నాము. కాని మన మెవరము? మనము

వ్యర్థులము. దేవుని యెదుట మన యోగ్యత ఎంత? మనము ఆయనకు సమర్పింపబడినట్లయితే ఆయన మనలను చేర్చుకొనును. మనలను గొప్ప బోధకులుగాను, పెద్దలనుగాను, నాయకులుగాను, పరిచారకులుగాను మలచును. దేవుడు చేయు పనిని తక్కువ అంచనా వేయవద్దు. నీవు దేవుని కొరకు చేయగలిగిన పనిని తక్కువగా అంచనా వేయవద్దు. ఆయన నీలో నివసించి నీ ద్వారా పనిచేయునట్లు నీలోనికి ఆహ్వానించుము.

## ప్రభువు సమర్థుడు

దేవుని వాక్యమును పఠించుము. సంఘ సమావేశాలకు హాజరగుము. సంఘముయొక్క పనిలోను, ఆరాధనలోను భాగము పంచుకొనుము. పాలుపొందుము. ప్రభువుకు నీకు నీవే సమర్పింపబడుము. ఆయనకు నమ్మకముగా జీవించుము. నమ్మకముగా యుండునట్లు నీ కుటుంబమును ప్రోత్సాహపరచుము. దేవుని కొరకు బోధించి, నీ జీవితమును మంచి పనులతో నింపుకొనుము. నీవు ఎంతగా ఆయనకు సమర్పింపబడితే అంతగా ప్రభువు ద్వారా గొప్ప కార్యములు జరిగించుటకు ఆయన సమర్థుడు.

చాలా మంది క్రైస్తవులు పాలుపొందుచున్నప్పటికీ వారు ఏమియు చేయుటలేదు. దేవుని కొరకు వారు నిజమైన కార్యాన్ని జరిగించుటలేదు. తరువాత వారు ప్రభువుకు దూరమగుదురు. వారు ప్రభువు కొరకు ఎట్టి ఫలాన్ని ఫలించలేరు. ఒకని ఉద్దేశ్యము, అతడు దేవునికి సమర్పించబడాలనే ఆసక్తి, సేవించాలనే కోరికతోను సమస్తము ఆధారపడి యున్నది. విశ్వాసము, పట్టుదల, సిద్ధపడియుండుట, నిశ్చయత, పాలుపొందుట అనునవి పనిచేయుటకు పర్యాయ పదాలుగా చెప్పుకొనవచ్చును. మోషే, దావీదు, పౌలు మొదలగువారు ఒక వేళ బద్ధకస్తులు, ఆసక్తి లేనివారు, దేవునియెడల తోటి మానవుల

యెడల శ్రద్ధ లేనివారైతే ఆయన వారిని ఎన్నుకొనేవాడు కాడు. వారిలో ఆయన గొప్ప బలాన్ని చూచెను, వారు పిలువబడిన వెంటనే లోబడిరి. మనము కూడ అంతే. ఈ దినాల్లో దేవుడు మానవుల ద్వారా తన కార్యాన్ని జరిగించుకొనుచున్నాడు. మనము మానవులము. మనము ఆయనకు చోటిస్తే ఆయన చిత్తాను సారముగా ఆయన మన ద్వారా తన పనిని జరిగించుకొనును. దేవుడు పిలుచుచున్నాడు మనము జవాబు యివ్వాలి. దేవుని కొరకు ఏమిచేయవలెనో అనే నిర్ణయము నీవు నేను తీసుకొనవలసియున్నది.

---

## ఆఖరి తీర్పరి

## ( The Final Arbiter )

సత్యమేదో, అసత్యమేదో, ఒకడు క్రైస్తవుడగుట, ఎట్లో దేవుని ఎట్లు ఆరాధించవలెనో మొదలగు ప్రశ్నలకు సరయిన వాక్యాధారము లేకుండా మనము దేవుడిచ్చిన మాదిరిని అనుసరించలేము. మన "ఆఖరి తీర్పరి" ఎవరు?

తీర్పరి (Arbiter) అనుపదాన్ని రేండమ్ హౌస్ కాలేజీ నిఘంటువు ఇలా నిర్వచించింది: "తీర్పు తీర్చుటకు లేదా నిర్ణయించుటకు అధికారము కలిగిన ఒక వ్యక్తి". ప్రతి ఆత్మ సంబంధమైన విషయములోను క్రైస్తవునికి ఒక ఆఖరి తీర్పరి కలడు. దేవుని నిర్ణయాన్ని లేదా చిత్తాన్ని మనమెట్లు గ్రహించగలమో దేవుని పరిశుద్ధ వాక్యము అనగా బైబిలు నందలి పేజీలలో స్పష్టముగ బయలుపరచబడినది.

2వ తిమోతి 3:16-17లో పౌలు వివరించెను;

"దైవజనుడు సన్నద్ధుడై ప్రతీ సత్కార్యమునకు పూర్ణముగా

సిద్ధపడి యుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము ఉపదే శించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజన కరమైయున్నది".

పూర్ణముగా సిద్ధపడియుండుట అనగా దైవావేశము వలన కలిగిన లేఖనము చదివి దేవుని చిత్తమును అనుసరించుటకు మనము సిద్ధపడవలసియున్నది. బోధించుటకు బైబిలు సరయిన ఆధారము. కాని యెడల మనము దేవుని చిత్తమును అనుసరించుటలేదు. దీనిని బట్టి ఆధునిక బోధకుల ద్వారా బోధింపబడే అసత్యాలను గ్రహించుట ఎంత సామాన్యమైన విషయము ?

"విశ్వాసమునుండి తొలగిపోయే" వారిని గూర్చి తిమోతి ముందుగా హెచ్చరించాడు. వారు వాత వేయబడిన మనస్సాక్షి గలవారని పౌలు తెలియజేసెను. వీరు ఒకసారి వేదన ననుభవించి, మనస్సాక్షిని కఠినము చేసికొని వేదనను అధిగమించలేక అవిధేయులైనవారు. సత్యము వారిని ఏమీ చేయలేదు.

## నా మనస్సాక్షి వాతవేయబడినదా ....

1. బాల్యోపదేశముల ద్వారా నా మనస్సాక్షి వాత వేయబడినదా? అప్పుడప్పుడు ఈ ఉపదేశములు విని అవే సత్యమని భావించుచున్నానా ? బైబిలు బోధతో వాటిని పోల్చి చూడగలిగానా ? సత్యము విషయంలో సుముఖంగా ఉన్నానా? ఒక అబద్ధాన్ని విశ్వసించిన సమయంలో సత్యమును గ్రహించునట్లు సహాయము చేయుమని దేవుని ప్రార్థించుచున్నానా?

2. మానవకల్పిత బోధలద్వారా నా మనస్సాక్షి వాత వేయబడినదా? శిష్యులు "పెద్దల పారంపర్యాచారములు" ఎందుకు అతిక్రమించుచున్నారను ప్రశ్నకు యేసు యిచ్చిన జవాబు యిదే:

"ఈ ప్రజలు పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు." (మత్త 15 : 8-9). దేవుని వాక్యముతో కలుపబడిన మానవ కల్పిత బోధలను నేను అంగీకరించుచున్నానా ? "దేవుని వాక్యము దీనిని వ్యతిరేకించుట లేదు" అని చెప్పి నన్ను నేనే సమర్థించుకొనుచున్నానా ? భోజనమునకు ముందు చేతులు కడుగుకొనుట పెద్దల పారంపర్యాచారము. వీటిని చేర్చుట ద్వారా వారి ఆరాధన వ్యర్థమైనది. విలువలేనిది. మనము దేవుని వాక్యముతో దేనిని కలుపకూడదు. ఆలాగు చేసిన యెడల మన ఆరాధన వ్యర్థమైనది.

3. అహంకారమైన మనస్సును కలిగియుండుట ద్వారా నా మనస్సాక్షి వాత వేయబడినదా ?

"నాకన్నియు తెలియును" నేనింకను చదువవలసిన అవసరమేమియు లేదని నీవనుకొనుచున్నావా ? తీర్పు దినాన విధేయత చూపకుండ 'మేము రక్షింపబడితిమని' తలంచి ఆయన యొద్దకు వచ్చు వారిని గూర్చి క్రీస్తు హెచ్చరించెను. వీరితో క్రీస్తు ఈవిధముగా చెప్పెను: "నేను మిమ్మును ఎన్నడును ఎరుగను అక్రమము చేయువారలారా నా యొద్దనుండి పొండి". విధేయత యను బండ మీద బుద్ధిమంతుడు తన యిల్లు కట్టుకొనును. బుద్ధిహీనుడు అవిధేయతయను ఇసుక మీద తన యిల్లు కట్టుకొనును.

4. గురి లేకపోవుట ద్వారా నా మనస్సాక్షి వాత వేయబడినదా ? "ప్రాణమా, అనేక సంవత్సరములకు విస్తారమైన ఆస్తి నీకు సమకూర్చబడియున్నది. సుఖించుము, తినుము, త్రాగుము, సంతోషించు"మనే గురి కలిగియున్నానా ? అలాగయితే "దేవుడు వెఱ్ఱివాడా, యీ రాత్రి నీ ప్రాణము నడుగుచున్నాను. నీవు సిద్ధపరచినవి

ఎవని వగునని" అతనితో చెప్పెను. యేసు అట్టివారి దయానీయ స్థితిని గూర్చి వివరించెను. దేవుని యెడల ధనవంతుడు కాక తనకొరకే సమకూర్చు కొనువాడు అలాగుననే యుండునని చెప్పెను (లూకా 7 : 24-27).

## వా మనస్సాక్షి తేలికైనదా ?

హృదయ పూర్వకముగా బైబిలును పఠించుటకు నిర్ణయాన్ని కలిగియున్నానా ? అపొస్తలులు ద్వారా దేవుడిచ్చిన మాదిరిని బట్టి ఆరాధనలోని అంశములన్నిటిని ఆచరించుటకు నిర్ణయాన్ని కలిగి యున్నానా ? ఆదిమ క్రైస్తవులు ఆరాధించిన విధంగా నేను ఆరా ఆరాధించుచున్నానా? క్రైస్తవుడగుట ఎట్లో, క్రొత్తనిబంధనలో వ్రాయబడిన మాదిరినిబట్టి ఎట్లు ఆరాధించవలెనో, సంఘము ఎట్లు నడిపింపబడవలెనో పాపములో నివసించు వారి పరిణామ మేమిటో రాబోయే పత్రికలలో బైబిలునుండి నేర్చుకొందాం. మేము చెప్పే విషయాలను బైబిలుతో పోల్చి చూడవలెనని మా పాఠకులను కోరుచున్నాము *(Readers are urged to compare what we Present with what the Bible Teaches)*. బెరయవారు పౌలు సీలలు చెప్పిన సంగతులు వాక్యాను సారంగా ఉన్నవో లేవోయని పోల్చి చూసారు (అపొ.కా. 17 : 11). తీర్పుదినాన మనలో ప్రతి ఒక్కరము మన సొంత ఆత్మ విషయములో బాధ్యతను కలిగియున్నాము. మేము బైబిలు చెప్పే విషయాలతో పోల్చకుండా లేదా సరిచూడకుండ ఏబోధను అంగీకరించలేదు.

మన పఠనములో ప్రాధమికమైన అంశమేమంటే 'ఆత్మ'తో ఆరాధించుట. యోహాను 4 : 23 నందిట్లు చదవగలము. "ఆత్మతోను సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది. అది ఇప్పుడును వచ్చేయున్నది. తన్ను ఆరాధించు వారు అట్టి వారే కావలెనని తండ్రి కోరుచున్నాడు".

మనము వాక్యమును ఆత్మను వేరుపరచలేము. మనము సరయిన ఆత్మను కలిగియుంటే సత్యముతో దేవుని ఆరాధించే ఆశను కలిగియుందుము. మరొక మాటలో మనము సత్యమును వెదకినట్లయితే దేవుని ఆత్మ యొక్క విలువను గ్రహించగలము. ఈ గురిని వెదకుటకు మనము అడుగ వచ్చును.

## నా ఆఖరి తీర్పరి ఎవరు ?

దేవుని వాక్యానికి ఏది కలుపకుండ, తీసివేయకుండ బైబిలు ఏమయితే బోధించుచున్నదో దానిని జరిగించుట ఈరోజుల్లో ఎక్కువ ప్రచారములో లేదు. చాలా మతశాఖల వారు ఈవిషయము సరైనది కాదని నమ్ముచున్నారు. పరలోకము మన గురి. మన ఆఖరి తీర్పరి దేవుడే. దేవుని వాక్యముతో మానవకల్పిత బోధలను చేర్చకూడదు. స్వచ్ఛమైన దేవుని వాక్యమునకు విధేయత చూపుటయే మన గురియైన పరలోకమునకు చేర్చే మార్గమును మత్త 7:14 నందు క్రీస్తు యిట్లు బోధించెను: "జీవమునకు పోవు ద్వారము ఇరుకును, ఆ దారి సంకుచితమునై యున్నది. దాని కనుగొనువారు కొందరే". మనము వారిలో ఉందాం.

— బార్బరా హన్నా.

---

## యేసుక్రీస్తు జననము

లోక రక్షకుడును, ప్రభువునైన క్రీస్తు జననమును గూర్చి లోకములో అనేక భిన్నాభిప్రాయములు గలవు. దీనిని గూర్చి లేఖనములను పరిశీలించుట ద్వారా గమనించుదము. కొందరు ఆయన కేవలము మానవుడని, మరికొందరు దైవ మానవుడని తలంచుచున్నారు.

### ప్రవచనాధారము

ప్రభువు ఈ లోకములో జన్మించెనని చెప్పుటకు మొదటి ఆధారము ప్రవచనములు. లేఖనములయందు మీకు నిత్యజీవము కలదని

తలంచుచు వాటిని పరిశోధించుచున్నారు. అవే నన్నుగూర్చి సాక్ష్యమిచ్చుచున్నవని ప్రభువు చెప్పెను (యోహా 5:39). అసలు యేసు క్రీస్తు ఈ లోకములోనికి వచ్చుటకు గల కారణ మేమనగా పాపులను రక్షించుటకు (1 తిమో 1:15). ఆది దంపతులైన ఆదాము, హవ్వలు దేవుని ఆజ్ఞను మీరుట వలన పాపము వచ్చెను. దాని వలన మరణము సంభవించెను. మరణమనగా ఆత్మీయ మరణము, అనగా నిత్య నరకాగ్నికి ఆత్మ గురియగుట. ఆ భయంకరమైన స్థితినుండి రక్షింపబడాలంటే ఒక రక్షకుడు అవసరము. మనకు తెలిసిన వేదములలో ఈలాగున్నది. "పాపపరిహారో రక్తప్రోక్షణ మవశ్యమ్. తద్ రక్తం పరమాత్మేనా పుణ్యదాన బలియాగం". దీని భావ మేమనగా మన పాపములు పరిహరించబడాలంటే రక్తం చిందించాలి. ఆ రక్తం పరమాత్మునిదై యుండాలి. అదే విషయమునుగూర్చి బైబిలు చెప్పుచున్నదేమనగా ఎడ్లయొక్కయు, మేకల యొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యం (హెబ్రీ 10 : 4). మరొక శ్లోకంకూడ కలదు. "అపుత్రస్య గతిర్నాస్తి". అనగా మన ఆత్మకు శాంతి చేకూరాలంటే పుత్రుడు కావాలి. పుత్రుడనగా పున్నామనరకం నుండి తప్పించువాడని అర్థము. దీనిని గూర్చి చాలమంది అక్షరానుసారముగా తీసుకొని పుత్రుడు పుట్టని వారికి గతులు లేవని నమ్ముచున్నారు. ఆ పుత్రుడు యేసు ప్రభువని బైబిలు చెప్పుచున్నది. "మనకు కుమారుడనుగ్రహించబడెను. ఆయన భుజముమీద రాజ్యభారముండును. ఆయన ఆశ్చర్యకరుడు. ఆలోచనకర్త. బలవంతుడైన దేవుడు నిత్యుడగు తండ్రి సమాధాన కర్తయగు అధిపతి యని చెప్పబడును" (యెషయా 9 : 6). ఆ కుమారుడే దేవుడని యిచ్చట స్పష్టముగా చెప్పబడెను. కావున ఆయన దేవుడు కాదు అని తలంచువారు ఈ సత్యమును గమనించాలి. ప్రభువు జన్మించిన తరువాత తూర్పుదేశపు జ్ఞానులు చూచుటకు వచ్చి ఆయన దేవుడని గుర్తించి బంగారమును

సాంబ్రాణిని కానుకగా సమర్పించిరి. ఆయనకు సాగిలపడి పూజించిరి (మత్త 2:11).

## అద్భుతాధారము

ప్రభువు లోకములో చేసిన అద్భుత కార్యములు: పక్షవాయువు గలవారిని లేవనెత్తుట (మత్త 9 : 1-6). కుష్ఠురోగులను, దయ్యము పట్టినవారిని బాగుచేయుట (మత్త 8 అధ్యా), తుఫానును గద్దించుట (మార్కు 4:37). చనిపోయినవారిని బ్రతికించుట (యోహా 4 : 43). తాను చనిపోయి తిరిగి లేచుట (మత్త 28 అధ్యా). ఇవన్నియు ఆయన దేవుని కుమారుడని నిరూపించుచున్నవి. మరియొక శ్లోకం గలదు : "అసతోమ సద్గమయ తమసోమ జ్యోతిర్గమయ-మృత్యోర్మ అమృతాంగమయ". దీని భావమేమనగా. ఓ దేవా అసత్యంనుండి సత్యములోనికి, చీకటిలోనుండి వెలుగులోనికి, మరణమునుండి జీవములోనికి దాటించు వానిని దయచేయుము. యేసు చెప్పిన దేమనగా, "నేనే మార్గమును, సత్యమును, జీవమునై యున్నాను. నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" (యోహా 14:6).

## చరిత్రాధారము

మరియొక ఆధార మేమనగా క్రీస్తు శకము ప్రారంభమై యిప్పటికి 1989 సంవత్సరములైనవని నిత్యము మనము వాడే తారీఖులు. అయితే ప్రభువుయొక్క జన్మదినము ఫలానా తారీఖున అని ఆధారమేమియు లేవు. ప్రభువును నమ్ముచున్న అనేకులు డిసెంబరు 25ను ప్రభువుయొక్క జన్మదినోత్సవమును జరిపించుకొనుచున్నారు. ఈలాగున చేయమని ఆజ్ఞ లేదు. కాని ప్రతి దినము మనము ఆయన జన్మదినమును గూర్చి చాటాలి (మార్కు 16:16). ఆజ్ఞాతిక్రమమే పాపము (1 యోహా 3:4). పాపమువలన వచ్చు జీతము మరణము (రోమా 6:23). ఆ రోజు ప్రజలు నూతన వస్త్రముల కొరకు గృహ

ముల అలంకరణకొరకు వేడుకల కొరకెంతో డబ్బును వ్యయపరచు చున్నారు. మనుష్యులుపై వాటిని లక్ష్యపెట్టుదురుగాని యెహోవా హృదయములను లక్ష్యపెట్టును (1 సమూ 16 : 7). నా తలంపులు మీ తలంపుల వంటివికావు మీ త్రోవలు నా త్రోవల వంటివి కావు అని యెహోవా సెలవిచ్చెను (యెష 55 : 8). దేవుని ఆజ్ఞలకు ఏమి కలుపకూడదు, తీసివేయకూడదు. అట్లు చేయువారు శాపగ్రస్తు లగుదురు (ప్రక 22 : 18, 19).

కాబట్టి ప్రభువును నమ్మువారు ప్రభువునందు ఎల్లప్పుడు ఆనందించాలి (ఫిలి 4 : 4). గాని ఈలోకాశలలో మాత్రం కాదు. ప్రతి ఒక్కరిలో క్రీస్తు జన్మించాలి. క్రొత్తగా జన్మించాలని దేవుని ఆజ్ఞ (యోహా 3 : 3). అది బాప్తిస్మము పొందుట ద్వారా సాధ్య మగును (యోహా 3 : 5). అప్పుడు ఆయన సంఘములో చేర్చబడు దుము (అపో.కా. 2 : 47). యేసుక్రీస్తులో యున్నవారికి యే శిక్షా విధియు లేదు (రోమా 8 : 1). కాబట్టి ఆయన రాజ్యమును—నీతిని మొదట వెదకుడి. అప్పుడవన్నియు మీ కనుగ్రహింపబడును (మత్త 6 : 33). ఆయన రాజ్యమనగా ఆయన సంఘము (కొలస్స 1 : 13; రోమా 16 : 16). ఇంతవరకు నీవు ఆరాజ్యములో లేనిచో త్వర పడుము. రేపేమి సంభవించునో మీకు తెలియదు (యాకో 4:14). కాబట్టి సమస్తమును పరిశీలించి మేలైన దానిని చేపట్టుడి (1 థెస్స 5 : 21).

— పి. ఫిలేమోన్, కాకినాడ-2

---

పది ఆజ్ఞలు :

## వ్యభిచరింపవద్దు

### (Thou Shalt Not Commit Adultery)

మానవ సమాజం నైతిక పవిత్రత కలిగియుండాలంటే మాన

వుల మధ్య సత్సంబంధము నెలకొల్పబడి యుండాలి. వారు తమ తలి దండ్రిలను సన్మానించాలి, నరహత్య చేయకూడదు అని చెప్పిన తరువాత దేవుడు "వ్యభిచరింపకూడదు" అని ఆజ్ఞాపించాడు. దేవుడు ఈ యాజ్ఞకు ఏ విధమైన కారణం ఇయ్యలేదు, ఇయ్యనక్కర్లేదుకూడ.

వ్యభిచారం అంటే యేమిటి? దాన్ని ఇద్దరు వ్యక్తుల మధ్య చట్టవిరుద్ధమైన లైంగిక సంబంధం అని మనం చెప్పుకోవచ్చును.

వైవాహిక సంబంధానికి వెలుపల జరిగే లైంగిక సంబంధం వ్యభిచారం; దీనినే జారత్వమని కూడ మనము చెప్పుకోవచ్చును. బైబిలు మూడు రకములైన వ్యభిచారమును గూర్చి చెబుతు దాన్ని ఖండించుచున్నది.

## శారీరకం

మొదటిది శారీరక వ్యభిచారము. ఆదికాండము 2:18 లో, "నరుడు ఒంటరిగా నుండుట మంచిదికాదు; వానికి సాటియైన సహాయ మును చేయుదునని" యెహోవా దేవుడు తలంచాడు. ఆయన స్త్రీని చేసి మానవుని కిచ్చాడు. "కాబట్టి పురుషుడు తన తండ్రిని తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును; వారు ఏక శరీరమై యుందురు" అని దేవుని వాక్యము చెప్పుచున్నది (ఆది 2:24). నీ పొరుగువాని భార్య వలన అపవిత్రత కలుగజేసికొనకూడదు అని మోషే ఇశ్రా యేలీయులను హెచ్చరించాడు (లేవీ 18 : 20). జారత్వము జరుగ కుండు నిమిత్తము ప్రతివానికి సొంత భార్య ఉండవలెను; ప్రతి స్త్రీకి సొంత భర్త యుండవలెను అని అపొ. పౌలు 1 కొరింథి 7 : 2లో హెచ్చరించాడు. ఆధునిక సమాజములో వ్యభిచారము చాల ప్రబలి యున్నది. వ్యభిచరించు వాని మీాదికి దేవుని తీర్పు ఇప్పుడు ఈ లోక ములోను రాబోవు లోకములోను కూడ తప్పక వస్తాది. వ్యభిచార కారణమువలన అనేకులు సుఖవ్యాధులకు గురి అవుచున్నారు. ఈమధ్య AIDS అనే ఘోరమైన వ్యాధి మొదలైనది. యిదివచ్చిన

వానికి శీఘ్ర మరణమే తప్ప మరొక మార్గము లేదు. అందువలనన్నే "వ్యభిచరింపకూడదు" అని దేవుడు ఆజ్ఞాపించాడు.

### మానసికం

రెండవదిగా మానసిక వ్యభిచారం మనకు కనబడుచున్నది. "దురాలోచనలు, నరహత్యలు, వ్యభిచారములు, వేశ్యాగమనములు, దొంగతనములు, అబద్ధ సాక్ష్యములు, దేవదూషణలు హృదయములో నుండియే వచ్చునని" యేసు ప్రభువు చెప్పాడు (మత్త15:19). పది ఆజ్ఞలలో వ్యభిచరించవద్దు అని ఆజ్ఞాపించబడితే యేసుప్రభువు దానిని కేవలం భౌతిక క్రియకు పరిమితము చేయక, దానిని గూర్చిన తలంపులనే అరికట్టాలని బోధించాడు: "వ్యభిచారము చేయవద్దని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా; నేను మీతో చెప్పున దేమనగా - ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసినవాడగును" అని ఆయన బోధించాడు (మత్త 5:27). "వ్యభిచారిణిని చూచి ఆశించుచు పాపము మానలేని కన్నులు గలవారు ..శాపగ్రస్తులై యున్నారని" పేతురు వ్రాసాడు (2 పేతురు 2:14).

దేవుడు వ్యభిచారాన్ని ఖండించాడు. దేవుని చట్టప్రకారము ప్రభుత్వ చట్టప్రకారము వివాహము చేసికొన్న స్త్రీ పురుషులు, "వారికను ఇద్దరుకాక ఏక శరీరముగా ఉన్నారు గనుక దేవుడు జత పరచిన దానిని మనుష్యుడు వేరుపరచకూడదని" యేసుప్రభువు బోధించాడు (మత్త 19:6). చీటికి మాటికి విడాకుల నిచ్చే పద్ధతిని ఆయన ఖండించాడు. సరిగదా, "వ్యభిచారము నిమిత్తమే తప్ప తన భార్యను విడనాడి మరియొకతెను పెండ్లి చేసుకొనువాడు వ్యభిచారము చేయుచున్నాడనియు, విడనాడబడిన దానిని పెండ్లి చేసికొనువాడు వ్యభిచారము చేయుచున్నాడనియు" యేసుప్రభువు బోధించాడు (మత్త 19:9). వ్యభిచార కారణము వలన గాక మరింకేదైనా కారణము

వలన పరిత్యాగ పత్రికల నిచ్చుట దేవుని చట్టానికి విరుద్ధమని గ్రహించుదము.

## ఆధ్యాత్మికం

తరువాత, ఆధ్యాత్మిక వ్యభిచారాన్ని బైబిలు ఖండించు చున్నది. ఇశ్రాయేలీయులు నిజదేవుడైన యెహోవాను ఎరిగి యుండియు, దేవుండ్లు కాని రాళ్ళకు, రప్పలకు, విగ్రహాలకు పూజ చేయడాన్ని దేవుడు ఆత్మీయ వ్యభిచార మన్నాడు. "ద్రోహినియగు ఇశ్రాయేలు...రాళ్ళతోను, మొద్దులతోను వ్యభిచారము చేసెను" అని యిర్మియా 3 : 8, 9 వచనాల్లో ఆయన చెప్పాడు. క్రైస్తవులు ఆధ్యాత్మిక భావంలో క్రీస్తుకు వివాహము చేయబడిన వారని పౌలు చెప్పుచున్నాడు: "కావున నా సహోదరులారా, మనము దేవుని కొరకు ఫలమును ఫలించునట్లు మృతులలో నుండి లేపబడిన క్రీస్తు అను వేరొకని చేరుటకై మీరును ఆయన శరీరము ద్వారా ధర్మశాస్త్రము విషయమై మృతులైతిరి" యని రోమా 7:4లో అతడు వ్రాసాడు. కొరింథులోని క్రైస్తవులతో పౌలు "దేవా భక్తితో మీ యెడల ఆసక్తి కలిగియున్నాను; ఎందుకనగా పవిత్రురాలైన కన్యకనుగా ఒక్కడే పురుషునికి అనగా క్రీస్తుకు సమర్పింపవలెనని మిమ్మును ప్రధానము చేసితినని" అని చెప్పాడు (2కొరింథీ 11:2).

ఒకడు క్రైస్తవుడైన తరువాత ఆయనను త్యజించి లోకముతో కలిసినప్పుడు ఆత్మీయంగా పతనమై వాడగును. "ఈ లోక స్నేహము దేవునితో వైరమని మీ రెరుగరా? కాబట్టి యెవడు ఈ లోకముతో స్నేహము చేయగోరునో వాడు దేవునికి శత్రువగును" అని భక్తుడైన యాకోబు వ్రాసాడు (యాకో 4:4).

'వ్యభిచరింపకూడదు' అని దేవుడు మోషే ద్వారా యిచ్చిన ఆజ్ఞను ఉల్లంఘించుటవలన కలిగే పర్యవసానము తీవ్రమైనది. లేవీయ కాండము 20 : 10లో మోషే ఇట్లు వ్రాసాడు : "పరుని భార్యతో

వ్యభిచరించినవానికి, అనగా తన పొరుగువాని భార్యతో వ్యభిచరించిన వానికి:, ఆ వ్యభిచారిణికిని మరణశిక్ష విధింపవలెను". "ఒకడు తన ఒడిలో అగ్ని నుంచుకొనిన యెడల వాని వస్త్రములు కాలకుండునా? ఒకడు నిప్పులమీద నడిచినయెడల వాని పాదములు కాలకుండునా? తన పొరుగువాని భార్యను కూడువాడు ఆ ప్రకారమే నాశనమగును. ఆమెను ముట్టువాడు శిక్ష తప్పించుకొనడు" అని సామెతలు 6:27-29లో సొలొమోను వ్రాసాడు. "జారత్వము జరిగించువాడు కేవలము బుద్ధి శూన్యుడు; ఆ కార్యము చేయువాడు స్వనాశనమును కోరువాడే" యని 32వ వచనములో అతడు వ్రాసాడు.

"వివాహము అన్ని విషయములలో ఘనమైనదిగాను, పానుపు నిష్కల్మషమైనదిగాను ఉండవలెను; వేశ్యాసంగులకును వ్యభిచారుల కును దేవుడు తీర్పు తీర్చును" అని హెబ్రీ 13:4లో పౌలు చెప్పుచు న్నాడు. జారులు, వ్యభిచారులు అగ్నిగంధకములతో మండు గుండ ములో పాలుపొందుదురని ప్రకటన 21:8 లో యోహాను వ్రాసాడు.

వ్యభిచరించువాడు దేవునికి, సమాజానికి, తనకు వ్యతిరేకముగా పాపము చేయుచున్నాడు. అట్టివాడు తన దుష్కార్యములను పరిత్య జించి, మారుమనస్సు పొంది దేవుని యొద్దకు తిరిగి రావలెను. పాపి యైన ప్రతి మానవుడు దేవుని తెలిసికొని, ఆయన కుమారుడైన క్రీస్తునందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు నొంది, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొంది రక్షింపబడాలని క్రీస్తు కాంక్షించుచున్నాడు. పాపులను వెదకి రక్షించడానికే ఆయన ఈ లోకానికి వచ్చాడు. ఆయన దగ్గరకు వచ్చుటకు నీవు ఇష్టపడు చున్నావా ?

—జాషువా గూటం,

# ధనాపేక్ష

## ( The Love of Money )

నీవు దేవునికిని సిరికిని దాసునిగా యుండనేరవు. ధనాశవలన ఆకాను ఇశ్రాయేలు సైన్యమునకు ఓటమి కలిగించాడు, తనకు తన కుటుంబానికి మరణము తెచ్చుకొన్నాడు. డబ్బుకొరకు బిలాము పాపముచేసి దేవుని ప్రజలను శపించ యత్నించాడు. డబ్బు కొరకు దెలీలా సమ్సోనును మోసగించింది, వేలకొలది ప్రజల వధకు కారకురాలయ్యింది. డబ్బువలన అననీయ సప్పీరాలు సంఘములో మొదటి వేషధారులయ్యారు. దేవుడు వారికి మరణ దండన విధించాడు. డబ్బుకొరకు యూదా యేసుప్రభువును అమ్మివేసాడు.

ధనాపేక్ష దేనికి దారి తీస్తాది? ఒకటి, ప్రజలు దేవుని మరచు లాగున ప్రేరేపిస్తాది.

సామెతలు గ్రంథమును వ్రాసినవాడు జ్ఞానియైన సొలొమోను, అయితే 30వ అధ్యాయమును ఆగూరు అనునతడు వ్రాసాడు. సొలొమోను నమ్మనశక్యమైనంత ధనికుడు. అయితే ధనము మధ్యను బంధింపబడినవాడై మరింత ఎక్కువ సంపాద్యము కావాలనుకొనే వాడు. అందువలన అతడు విదేశీ స్త్రీలను వివాహ మాడేవాడు. ఈ స్త్రీలు తమతోకూడ గొప్ప సంపదను తెచ్చేవారు. అందువలన అతడు ఇశ్రాయేలీయుల మధ్యకు విగ్రహారాధనను కొనితెచ్చాడు, తన జీవితాన్ని పాడుచేసుకొన్నాడు.

సొలొమోనుకు సంభవించిన దానిని ఆగూరు చూచినవాడై ఇట్లు ప్రార్థించాడు: "పేదరికమునైనను ఐశ్వర్యమునైనను నాకు దయచేయకుము. తగినంత ఆహారము నాకు అనుగ్రహింపుము" (సామె 30 : 8). ఎందువలన? "ఎక్కువైన యెడల నేను కడుపు నిండినవాడనై నిన్ను విసర్జించి, యెహోవా ఎవడని అందునేమో.

లేక బీదనై దొంగిలి నా దేవుని నామమును దూషింతునేమో" (సామె 30:9). ఆగూరు యేమి పలుకుచున్నాడు? నాకు సమృద్ధిగా ఇయ్యవద్దు. ఇచ్చిన యెడల నిన్నుగాక నా ధనాన్ని సేవింతునేమో. లేదా నేను దొంగిలకుండునట్లు నాకు తక్కువ కూడ ఇయ్యవద్దు. ధనాపేక్ష దేవుని మరచులాగున మనలను నడిపించగలదు.

ధనాపేక్షలో యున్న మరొక ప్రమాదం యేమంటే మనం దానిలో విశ్వాసముంచుటకు మొదలిడుతాం. నీవు నీ దేవునియందు నమ్మిక కలిగి యున్నావా? లేక నీ ధనమునందా? యోబు ఇట్లనుచున్నాడు: "సువర్ణము నాకు ఆధారమనుకొనిన యెడలను, నా ఆశ్రయము నీవేనని మేలిమి బంగారముతో నేను చెప్పిన యెడలను, నా ఆస్తి గొప్పదనిగాని, నా చేతికి విస్తారము సొత్తు దొరికెననిగాని నేను సంతోషించిన యెడల...పరమున నున్న దేవుని దృష్టికి నేను వేషధారి నవుదును" (యోబు 31 : 24-28). "ధనమును నమ్ముకొనువాడు పాడై పోవును. నీతిమంతులు చిగురాకులవలె వృద్ధి నొందుదురు" (సామె 11:28).

—టామ్ కెల్టన్.

---

## కన్నుల యెదుట కనబడుచున్న పాపము

(కీర్తనలు 51 : 1-3)

"దేవా నీ కృప చొప్పున నన్ను కరుణింపుము. నీ వాత్సల్య బాహుళ్యము చొప్పున నా అతిక్రమములను తుడిచివేయుము. నా దోషము పోవునట్లు నన్ను బాగుగా కడుగుము. నా పాపము పోవునట్లు నన్ను పవిత్రపరచుము. నా అతిక్రమములు నాకు తెలిసియున్నవి. నా పాప మెల్లప్పుడు నా యెదుట ఉన్నది."

ఒకానొక దినమున పొద్దు గుంకువేళ దావీదు రాజు నగరి మిద్దెమీద నడచుచు, బహు సౌందర్యవతియై స్నానము చేయుచున్న ఒక స్త్రీని చూచెను. ఆమె ఊరియా భార్యయైన బత్షెబ. దావీదు ఆమెతో శయనించెను. ఆమె గర్భవతినని దావీదుకు వర్తమానము పంపెను. ఆ నేరము తన భర్తపై మోపుటకు యుద్ధములోనున్న ఊరియాను పిలిపించి ఇంటికి పోయి శ్రమ తీర్చుకొమని చెప్పెను. ఊరియా తన ఇంటికి పోలేదను మాట విని కుటిల ప్రయత్నములు చేసి చివరకు ఊరియాను చంపించెను. దావీదు చేసినది దేవుని దృష్టికి దుష్కార్యముగా ఉండెను (II సమూయేలు 11:3-27).

పాపము చాలా భయంకరమైనది. నిన్న, నేడు, నిరంతరము దుఃఖము యొక్క తల్లి పాపము. పాపమునకు జీతం ఎల్లప్పుడూ చెల్లించబడుతుంది: ఆలస్యమైనచో వడ్డీతో సహా చెల్లింపబడును. పాపము పీడిస్తుంది, బాధిస్తుంది, మనశ్శాంతి లేకుండా చేస్తుంది. ఉన్న మంచితనం మంటగలువుతుంది. సర్వనాశనం చేస్తుంది.

"తండ్రీ నేను పరలోకమునకు విరోధముగాను, నీ యెదుటను పాపము చేసితిని. ఇక మీదట నీ కుమారుడ ననిపించుకొనుటకు యోగ్యుడను కాను" (లూకా 15 : 18, 19). ఇది తప్పిపోయిన కుమారునియొక్క హృదయ పరివర్తన. ఇతని పాపము అన్నివైపుల దెబ్బతీసింది. పాపము చేయువాడే మరణ మొందును. తండ్రియొక్క దోష శిక్షను కుమారుడు మోయుటలేదని, కుమారునియొక్క దోష శిక్షను తండ్రి మోయడు. నీతిపరుని నీతి ఆ నీతిపరునికే చెందును. దుష్టుని దుష్టత్వము ఆ దుష్టునికే చెందును (యెహెజ్కేలు 18:20). ఎవరి పాపమునకు వారే బాధ్యులు. బాధ్యత తప్పించుకో లేనటువంటిది.

పాపమును చేయు బుద్ధిహీనుడు దాని కంటి యుండును.

"నా పాపము నా కన్నులకు కనబడుచున్నది." అంటే తాను వట్టి దావీదు తెలుసుకున్నాడు. "ఎవడును తన్ను తాను మోసపరచుకొనకూడదు. మీలో ఎవడైనను ఈ లోకమందు తాను జ్ఞానినని అనుకొనినయెడల జ్ఞాని అగునట్లు వెర్రివాడు కావలయును" (1 కొరింథీ 3:18).

నా దోషమును కప్పుకొనక నీ యెదుట నా పాపమును ఒప్పు కొంటిని (కీర్తన 32:5). నా దోషమును నేను ఒప్పుకొనుచున్నాను. నా పాపమును గూర్చి విచారపడుచున్నాను (కీర్తన 38 : 18). అతి క్రమములను దాచిపెట్టువాడు వర్ధిల్లడు, వాటిని ఒప్పుకొని విడచిపెట్టు వాడు కనికరము పొందును (సామెతలు 28:13). దావీదు తన పాప మును దేవుని యెదుట ఒప్పుకొనెను. ప్రియ చదువరీ, నీ పాపము నీ కన్నుల యెదుట కనబడుచున్నదా? నీ అతిక్రమములను దాచిపెట్టు చున్నావా? వాటిని ఒప్పుకొని విడచిపెట్టుము.

పాపము చేయు ప్రతివాడు ఆజ్ఞను అతిక్రమించును. ఆజ్ఞాతి క్రమమే పాపము (1 యోహాను 3:4). ప్రయాసపడి భారము మోసు కొనుచున్న సమస్త జనులారా నా యొద్దకురండి నేను మీకు విశ్రాం తిని కలుగజేయుదును. "నేనే మార్గమును, సత్యమును, జీవమును. నా ద్వారా తప్ప ఎవడును తండ్రియొద్దకు రాడు" (యోహాను 14:6). "పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు ఈ లోకమునకు వచ్చెను" (1 తిమోతి 1:15). యేసు రక్తము ప్రతి పాపమునుండి పవిత్రులుగా చేయును (1 యోహాను 1:7).

ఓ పాపీ నీ పాపము నీ కన్నులకు కనబడుచున్నది. గనుక

నీవు తడవుచేయుటకు ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి నీ పాపములను కడిగివేసుకొనుము (అపొ. కార్య 22:16). క్రీస్తు నామమునే రక్షణ కలదు. శరీర దురాశలకు లోబడునట్లుగా చావుకు లోనైన మీ శరీరమందు పాపమును ఏలనియ్యకుడి.

—రామకృష్ణారావు సబ్బతి, గంటి.

---

# క్రైస్తవ ఆరాధన

అనాది కాలమునుండి మానవుడు జీవముగల దేవుని ఆరాధించుటకు అలవాటుపడి యున్నాడు. తన భక్తి భావములను బలియర్పణల ద్వారా భగవంతునికి ఎరుకచేసి, తను ముక్తిని పొందాలనే తాపత్రయం కలిగి యున్నాడు.

ఇశ్రాయేలీయుల కివ్వబడిన పది యాజ్ఞలలో మొదటి ఆజ్ఞ ఆరాధనకు సంబంధించినదై యున్నది. దేవునియొక్క జనాంగము ఆయనను ఆరాధించుటకు గాను ప్రత్యేకింపబడి యున్నారు. లేవీయ కాండములో సర్వశక్తిగల తండ్రియగు దేవుని ఆరాధించుటకు అనేకమైన ఆజ్ఞలు ఇశ్రాయేలీయుల కివ్వబడినవి.

అబ్రాహాము, మోషే, యెషయా, దావీదు తదితరులద్వారా ఆరాధించుట అనే గొప్ప సాంప్రదాయము ఒక కళగా వారికి మిగిలి పోయింది. దేవుని ఆరాధించుట యనునది భూమియందున్న నరులకు మాత్రమే పరిమితమై యుండక, నిత్యము పరలోకమునందును జరుగు ప్రశస్త కార్యమై యున్నది. (ప్రకటన 4, 5 అధ్యా).

## ఆరాధన అనగా ఏమిటి?

పాతనిబంధనలోని ఆరాధన అను పదమునకు హెబ్రీ భాషలో సాష్టాంగ పడుట అని అర్థము. దానినే మనము ఘనపరచుట యనుచున్నాము (ఆది కా. 18:2). జ్ఞానముగల ప్రతి జీవియు మరియు దేవదూతలు, ఆయన పరిశుద్ధులు, దేవుని ఆరాధిస్తున్నారు (నెహె 9 : 6). ఆరాధనను గురించి పరిశుద్ధ గ్రంథములో పలుచోట్ల వ్రాయబడియున్నది. నిజానికి ఇశ్రాయేలీయుల ఆరాధనలు దేవునికి ప్రీతికరమైనవిగా లేకపోయినవి. పలుమార్లు వారు దేవుని విడిచి సాతానీయ చర్యలకు దిగజారిపోయారు. మనము విగ్రహారాధన చేయరాదని దేవునిచే ఆజ్ఞాపింపబడుచున్నాము. ఈ లోకములోని అన్యజనులు కర్ర, రాతి, లోహసంబంధములగు విగ్రహములు చేసుకొని దైవత్వము వాటికి ఆపాదించి ఆరాధనలు చేస్తున్నారు. మరియు అనేకులు స్వార్థము, ధనము, వ్యాపారము, సౌందర్యము, సౌఖ్యము, కుటుంబము, విద్య, విజ్ఞానము, ఆస్తి - అధికారము, గొప్పతనము, అను విగ్రహములను ఆరాధిస్తూ అన్నిటికి కర్తయై యున్న దేవుని ఆరాధించుట మరచిపోవుచున్నారు. కొందరు మతనాయకులు వారి అనుచరులకు దేవుళ్ళయి పూజింపబడుచున్నారు. క్రైస్తవ బోధకులు (గురువులు) గా పిలువబడుచున్నవారు నేడు పాదాభివందనములు స్వీకరించుచున్నారు (అ.కార్య 10:25-26). సృష్టిని (ప్రకృతిని) పూజించుచూ మట్టిని ఆరాధించుచూ, సర్వసృష్టికర్తయైన దేవుని ఆరాధించుట మనము మరచితిమా? ఆలోచించుకొందము.

మన తండ్రియైన దేవుడు మనలను ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెనని కోరుచున్నాడని క్రొత్తనిబంధన తెలియజేయుచున్నది (యోహా 4). ఇశ్రాయేలీయులు దేవుని ఆరాధించుటకు ఏడాదికి మూడుసార్లు యెరూషలేమునకు వెళ్లవలసియుండెడి వారు

ఆవిధంగా ఆరాధనకు వెళ్లని వారికి శిక్ష విధించబడేది. సాంప్రదాయ ఆచారములతో కూడిన పై పై యూరాధనలు కోరక, హృదయాంతరంగమునుండి వచ్చు ఆరాధనలు కావలెనని తండ్రి కోరుచున్నాడని యేసుప్రభువు సమరయ స్త్రీతో సంభాషించెను. ఇశ్రాయేలీయుల యొక్క ఆరాధన స్వాభావికమైనది. చక్కని దుస్తులు ధరించి, సంగీత వాయిద్యములతో స్తోత్రగీతములు వినిపించి, బలులు అర్పించేవారు. కాని అది శారీరక ఆరాధన మాత్రమే అయియుండెను. అది దేవునికి అంగీకారము కాకుండెను (ఆమోసు 5 : 22-23). "ఇప్పుడు ఆత్మతోను సత్యముతోను ఆరాధించునట్టివారు కావలెనని" తండ్రి కోరుచున్నాడు (యోహాను 4 : 23).

## ఆత్మారాధన అనగా ఎట్టిది ?

క్రైస్తవ ఆరాధన యొక్క విధమును యేసు చెప్పిన మాటల యందు కనుగొనగలము. "దేవుడు ఆత్మయైయున్నాడు. గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెను". పాపియైన మానవుడు దేవుని ఎట్లు ఆరాధింపగలడు ? పాపమును హృదయములో ఉంచుకుని ప్రార్థించినా దేవుడు వినడు. అట్టివారి ఆరాధనలు కూడ అంగీకరింపడు. అయితే పాపియైన మనుష్యుడు పశ్చాత్తాపముతో దేవుని వైపు మళ్లుకొని, మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందినప్పుడు, దేవుడు అంగీకరించిన ఒకే ఒక శ్రేష్ఠమైన బలి (సిలువలో క్రీస్తుబలి) ద్వారా చిందింపబడిన యేసు రక్తము ద్వారా అట్టిపాపి పవిత్రుడు కాగలుగుటయే కాక, వాడు క్రొత్తజన్మ నొందిన వాడగును. పరిశుద్ధాత్మ ద్వారా అతడు నూతన జీవముతో కలుపబడుచున్నాడు. నూతన జన్మ ద్వారా ఆత్మ సంబంధమగు జీవితము కలిగినవాడై, సంఘమునకు శిరస్సు అయియున్న క్రీస్తు యేసునుబట్టి క్రొత్తనిబంధన క్రిందికి వచ్చియున్నాడు. అతడు దేవుడు తనకు అనుగ్రహించిన కృపా కార్య

ములను స్మరించి తరించి హృదయాంతరంగములోనుండి శ్రావ్యమైన స్వరము నెత్తి పూర్ణహృదయముతో తండ్రియైన దేవుని శ్లాఘిస్తూ, ఘనపరచి స్తుతులు చెల్లించుచూ ఆయనను ఆరాధించగలడు. ఈ ఆరాధనలలో బలులు లేవు. నైవేద్యములు లేవు. తంత్రివాయిద్యములు కానరావు. యెరూషలేము—గెరాజేధము పర్వతాలకు అతడు ఆరాధనలకు పోనక్కర్లేదు. కానీ క్రీస్తు నామము ధరించుకున్న సంఘములో చేరి, అపొస్తలుల బోధ, సహవాసము, రొట్టె విరుచుట, పాడుట ప్రార్థించుట కానుక లిచ్చుట యను కార్యముల ద్వారా ఆత్మారాధన సత్యారాధన క్రైస్తవ ఆరాధన ద్వారా దేవుని మహిమ పరచుచూ నిత్యత్వములో ప్రవేశించ వచ్చును. ★

— సామ్యూల్ జాన్ మేడిది, కోణితివాడ.

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
SATYAWAKKU
P.O. Box. 80
KAKINADA—533 001

No.

To ..............................
..............................
..............................
..............................